సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

ఆదివారం । 1 । అక్టోబర్ । 2023



వజ్రోత్సవాలు షురూ

వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. - 8లో



పీహెచ్‌డీ అడ్మిషన్ల అవకతవకలపై స్పందించాలి

పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అవకతవకలపై ప్రభుత్వం స్పందించాలని కేయూ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. - 8లో



వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు మెరుపులతో చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

9న స్పాట్ అడ్మిషన్లు

కాజీపేట: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు ఈనెల 9న ఉదయం 10 గంటలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కాజీపేట ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కె.అశోక్‌కుమార్ శనివారం తెలిపారు. ఇటీవల దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. కొత్తగా ఐటీఐలో అడ్మిషన్లు పొందాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆదివారం నుంచి 8వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 9న స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని, సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

3 నుంచి సదరం స్లాట్ బుకింగ్

హన్మకొండ: అక్టోబర్ 3న మధ్యాహ్నం 12 గంటల నుంచి మీ సేవ కేంద్రాల్లో సదరం స్లాట్ బుకింగ్ చేసుకోవాలని హనుమకొండ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థోపెడిక్, అంధత్వం, మానసిక, వినికిడి లోపం కలిగిన దివ్యాంగులు ఎంజీఎం, ఆర్‌ఈహెచ్ మెడిక్ బోర్డు నిర్వహించే సదరం క్యాంపులకు హాజరయ్యేందుకు స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. దివ్యాంగులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి

విద్యారణ్యపురి: ఈఏడాది డిసెంబర్ 10న జరగబోయే ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలకు ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని అక్టోబర్ 13వ తేదీ వరకు గడువు ఉందని హనుమకొండ డీఈఓ ఎండీ అబ్దుల్‌హై శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు చేసుకునే విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయం రూ.3.50 లక్షలకు మించరాదని ఆయన పేర్కొన్నారు. తహసీల్దార్ జారీ చేసిన ఆదాయ ధ్రువీకరణ పత్రం, అంగవైకల్యానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రం ఉంటే విద్యార్థులు పాఠశాలల హెచ్‌ఎంలకు సమర్పించాలని పేర్కొన్నారు. పరీక్ష ఫీజుతో సహా ఇతర వివరాల కోసం సంబంధిత వెబ్‌సైట్ హెచ్‌టీటీ//బీఎస్‌ఈ.తెలంగాణ.గౌట్.ఇన్‌లో చూడొచ్చని సూచించారు. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా సంబంధిత వెబ్‌సైట్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

న్యూశాయంపేట: ఎస్‌బీఐ (బీపీఓ) బ్యాంకు ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు హనుమకొండ జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి మేన శ్రీను శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులకు నెల రోజులు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దరఖాస్తులు స్వీకరించేందుకు ఈనెల 6వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. వివరాలకు సుబేదారి కలెక్టరేట్ కాంప్లెక్స్ 2వ అంతస్తులోని కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. 73309 90322 నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

• **రూ.2 కోట్ల గిఫ్ట్ డీడ్ రద్దు**


కమలాపూర్‌కు చెందిన ఓ ఉద్యోగి తన రూ.2కోట్ల ఆస్తిని ఇద్దరు కొడుకులకు రిటైర్‌మెంట్ అనంతరం రాసిచ్చాడు. గతంలో భార్య చనిపోవడంతో అతడు కొడుకుల వద్ద ఉంటూ జీవనం సాగిస్తున్నారు. ఆస్తి రిజిస్ట్రేషన్ చేసుకున్న అనంతరం కుమారులు తండ్రిని ఇంటి నుంచి గెంటేశారు. ఎల్డర్ లైన్ 14567ను సంప్రదించగా కుమారులకు చేసిన ఆస్తి గిఫ్ట్‌డీడ్‌ను క్యాన్సిల్ చేసి తిరిగి తండ్రికి కేటాయించారు.

• **కోడలు నుంచి అత్తకు విముక్తి..**

హసన్‌పర్తికి చెందిన ఓ వృద్ధురాలికి ఒక్కడే కుమారుడు. భర్త చనిపోవడంతో కుమారుడి వద్దే ఉంటుంది. కోడలు తరచూ కొడుతూ.. ఇంటినుంచి బయటకు గెంటివేసింది. దిక్కుతోచని స్థితిలో వృద్ధురాలు ఎల్డర్‌లైన్‌ను ఆశ్రయించింది. జిల్లా సంక్షేమాధికారి ఆధ్వర్యంలో కుమారుడు, కోడలికి కౌన్సెలింగ్ చేసి వృద్ధురాలి పోషణను చూసుకునే విధంగా చర్యలు తీసుకున్నారు.

• **తప్పిపోయిన వృద్ధురాలు.. కుటుంబ సభ్యుల చెంతకు**

దామెర మండలానికి చెందిన ఓ వృద్ధురాలు మతిస్థిమితం కోల్పోయి హనుమకొండ నక్కలగుట్ట ప్రాంతంలోని హరిత హోటల్ వద్ద ఒంటరిగా తిరుగుతోంది. గమనించిన ఓ సీనియర్ సిటిజన్.. ఎల్డర్ లైన్ టోల్‌ఫ్రీ 14567కు సమాచారం ఇచ్చాడు. వారు పోలీసులకు సమాచారం అందజేసి వృద్ధురాలిని తిరిగి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు.



వయోవృద్ధుల ఆత్మీయ నేస్తం ఎల్డర్ లైన్ 14567

మలిదశలో అండగా నిలుస్తున్న టోల్‌ఫ్రీ నంబర్

- 2019 నుంచి వయోవృద్ధులకు అందుబాటులో
- సొంతింటిని తలపించే విధంగా వృద్ధాశ్రమ నిర్మాణం
- ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో వృద్ధమిత్ర హెల్ప్‌డెస్క్
- పైలట్ ప్రాజెక్టుగా కేయూసీలో తొలి హెల్ప్‌డెస్క్ ఏర్పాటు
- నేడు అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం

కాజీపేట అర్బన్: కన్న బిడ్డలు తమ తల్లిదండ్రుల సంరక్షణలో అలసత్వం వహించినా, అనాథలుగా మార్చి వృద్ధాశ్రమాల్లో చేర్పించి చేతులు దులుపుకునేందుకు యత్నించిన వారిని సరైన మార్గంలో నిలిపేందుకు.. మలి దశలో ఉన్న వారి గోడును వినే ఆత్మీయ నేస్తంగా ఎల్డర్ లైన్ టోల్‌ఫ్రీ నంబర్ 14567 నిలుస్తోంది. తమ పోషణ, సంరక్షణకు ఎంతో శ్రమించిన తల్లిదండ్రులు వృద్ధాప్యంలోకి జారుకోగానే భారంగా మారిపోయారని భావించే పిల్లలకు కౌన్సెలింగ్‌తోపాటు వారి సంరక్షణ బాధ్యతను తెలిపేందుకు ప్రతీ ఏడాది అక్టోబర్ 1వ తేదీని అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంగా నిర్వహిస్తోంది. నేడు అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

2019 నుంచి ఎల్డర్ లైన్–14567 అందుబాటులోకి..

భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా టాటా ట్రస్ట్ సౌజన్యంతో వయోవృద్ధులకు ప్రత్యేక గౌరవం సమాజంలో కల్పించాలని, తల్లిదండ్రుల పోషణను కన్న బిడ్డలు బాధ్యతగా స్వీకరించాలని తెలిపేందుకు గాను 2019లో ఎల్డర్ లైన్ పేరిట టోల్‌ఫ్రీ నంబర్ 14567ను అందుబాటులోకి తీసుకొచ్చింది. వయోవృద్ధులు తమ పిల్లల నుంచి ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి ఈ నంబర్‌కు కాల్ చేస్తే చాలు ఎఫ్‌ఆర్‌ఓ (ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్) తమ వద్దకు చేరుకుని వారి న్యాయపరమైన, సంరక్షణ, పోషణ సమస్యలను పరిష్కరించడంతో పాటు కన్న పిల్లలకు కౌన్సెలింగ్ ద్వారా మార్పు కల్పించేందుకు కృషి చేస్తారు. వైద్య, న్యాయ, తాత్కాలిక వసతి కల్పిస్తారు. ఇటీవల ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసేందుకు గాను www.tsamms.cgg.gov.in వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో వృద్ధ మిత్రకు శ్రీకారం..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో వయోవృద్ధుల సమస్యలను పరిష్కరించేందుకు వృద్ధ మిత్ర హెల్ప్‌డెస్క్‌కు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా హనుమకొండ జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్‌గా కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో తొలి వృద్ధ మిత్ర హెల్ప్ డెస్క్‌ను శనివారం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈడెస్క్‌లో పోలీస్ ఆఫీసర్, లాయర్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో కూడిన ఫోర్‌మెన్ కమిటీ అందుబాటులో ఉంటుంది.

ప్రత్యేక ట్రిబ్యునల్స్...

ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆర్డీఓ స్థాయిలో ప్రత్యేక ట్రిబ్యునల్స్ అందుబాటులో ఉన్నాయి. వయోవృద్ధులు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఆర్డీఓ ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేస్తే సమస్య పరిష్కరిస్తారు. మెయింటనెన్స్ ఆఫ్ సీనియర్ సిటిజన్స్ యాక్ట్ 2007 ప్రకారం తల్లిదండ్రుల పోషణను విస్మరించిన పిల్లలపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఎల్కతుర్తి గ్రామంలో వయోవృద్ధులకు సొంతింటిని తలపించేలా ఎకరం భూమిలో వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అలీమ్‌కో అనే స్వచ్ఛంద సంస్థ ప్రత్యేక క్యాంప్‌లను ఏర్పాటు చేసి వృద్ధులకు చేతి కర్రలు, కళ్లద్దాలు అందజేస్తోంది.

వయో వృద్ధుల సమస్యల పరిష్కారానికి కృషి

పోలీస్ ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య

హసన్‌పర్తి: వయో వృద్ధులపై బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూనే వారిలో మనోధైర్యాన్ని అందించేందుకు వృద్ధమిత్ర డెస్క్ ఏర్పాటు చేసినట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య తెలిపారు. కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో శనివారం వృద్ధమిత్ర హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. వృద్ధులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. సీనియర్స్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ విద్యారణ్యపురి గౌరవ అధ్యక్షుడు దామెర నర్సయ్య మాట్లాడుతూ తమ సంస్థ చేస్తున్న కృషి ఫలితంగానే ఈ డెస్క్ ఏర్పాటైందన్నారు. ఈసందర్భంగా సీపీ రంగనాథ్, డీసీపీ బారి, ఏసీపీ కిరణ్‌కుమార్‌కు సీనియర్స్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ కృతజ్ఞతలు తెలిపింది. ప్రభాకర్‌రెడ్డి, బొంగోని లింగయ్య, బూర సుజాత, లక్ష్మీనారాయణను వృద్ధ మిత్ర కమిటీ సభ్యులుగా నియమించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగంధర్, సభ్యులు నర్సయ్య, చిదురాల సత్యనారాయణ, ఉపేంద్రచారి, యాదగిరి, సాంబయ్య, నరసింహారామయ్య, పరికిపండ్ల వేణు పాల్గొన్నారు.



వృద్ధమిత్ర హెల్ప్ డెస్క్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న పోలీస్ ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య

నేడు కలెక్టరేట్‌లో వేడుకలు



హనుమకొండ కలెక్టరేట్‌లో ఆదివారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తాం. ఎల్డర్ లైన్ టోల్‌ఫ్రీ నంబర్ 14567కు వచ్చిన 168 ఫిర్యాదుల్లో 121 ఫిర్యాదులను పరిష్కరించాం. సీనియర్ సిటిజన్స్‌కు ప్రత్యేక గుర్తింపు కల్పించేందుకు 60 ఏళ్లు పైబడిన వారికి ప్రత్యేక ఐడీ కార్డు అందజేస్తున్నాం. తద్వారా ప్రయాణాల్లో రాయితీ పొందే అవకాశం ఉంటుంది.

- మధురిమ, స్త్రీ, శిశు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా ఇన్‌చార్జ్ అధికారి

సంక్షేమ సభకు ముమ్మర ఏర్పాట్లు

- ఈనెల 6న ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ రాక
- సభాస్థలి పరిశీలన, సమీక్ష

ఖిలా వరంగల్: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అక్టోబర్ 6న ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పర్యటించనున్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఖిలా వరంగల్ వాకింగ్ గ్రౌండ్‌లో నిర్వహించే సభాస్థలిని కలెక్టర్ ప్రావీణ్య, మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషా, డీసీపీ బారి, ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, మున్సిపల్ డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ మసూద్, ఆర్డీఓ వాసుచంద్ర, ఏసీపీ బోనాల కిషన్, తహసీల్దార్లు ఎక్బాల్, నాగేశ్వరరావు, 'కుడా' పీఓ అజిత్‌రెడ్డితో కలిసి శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ పరిశీలించారు. సభకు ముమ్మరంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ టి.సురేశ్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న, స్థానిక కార్పొరేటర్లు బైరబోయిన ఉమ, వెల్పుగొండ సువర్ణ, మరుపల్లి రవి, కవిత, పద్మ అధికారులు పాల్గొన్నారు.



సమీక్షలో ప్రజాప్రతినిధులు, అధికారులు

ఏర్పాట్లపై సమావేశం

నయీంనగర్: మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా ఏర్పాట్లపై వివిధ విభాగాల ఉన్నతాధికారులతో శనివారం 'కుడా' కార్యాలయ మీటింగ్ హాల్లో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ సమీక్ష నిర్వహించారు. ఇందులో మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, 'కుడా' చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, డీసీపీ బారి, హనుమకొండ అడిషనల్ కలెక్టర్ మహేందర్ జీ, డీఆర్డీఓ శ్రీనివాస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం బకాయి పడడం సిగ్గు చేటు

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

హన్మకొండ: మధ్యాహ్న భోజన వర్కర్లకు ప్రభుత్వం బకాయి పడడం సిగ్గు చేటని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి దుయ్యబట్టారు. మధ్యాహ్న భోజన కార్మికులకు వెంటనే నిధులు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 11 రోజులుగా హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద సమ్మె చేస్తున్న మధ్యాహ్న భోజన వర్కర్లకు శనివారం ఆయన సంఘీభావం తెలిపారు. సమ్మెకు మద్దతు ప్రకటించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికి ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలు అందించకుండా చేతులు దులుపుకుంటున్నాయని విమర్శించారు. ప్రభుత్వం పది నెలల నుంచి గౌరవ వేతనం ఇవ్వకుండా గోస పెడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ మధ్యాహ్న భోజన వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రామ్మూర్తి, కార్యదర్శి కర్రె భిక్షపతి, నాయకులు మారుపాక అనిల్‌కుమార్, తోట భిక్షపతి, కవిత, వైనాల విజయ, అరుణ, పద్మ, జనగాం లక్ష్మి, వనమాల, కొట్టెపాక రవి, దేవ పాల్గొన్నారు.



చాడ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

కోర్టులో లొంగిపోయిన ఆర్‌ఐ అన్వేష్

బెయిల్ తిరస్కరణ.. పరకాల సబ్‌జైల్‌కు తరలింపు - వివరాలు 8లో

అర్హులందరికీ పథకాలు చేరాలి

ఎంపీ దయాకర్



మాట్లాడుతున్న ఎంపీ దయాకర్

హన్మకొండ: ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులందరికీ చేరేలా అధికారులు కృషి చేయాలని వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ అన్నారు. శనివారం హనుమకొండ సుబేదారిలోని కలెక్టరేట్ సమావేశం మందిరంలో అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం జరిగింది. ఇందులో దయాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్షించారు. ఇందులో ఎంపీ దయాకర్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పథకాలు పక్కదారి పట్టకుండా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, వరంగల్ అర్బన్ జిల్లా పరిషత్ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషా షేక్, ట్రైనీ ఐఏఎస్ శ్రద్ధ శుక్లా, డీఆర్డీఓ శ్రీనివాస్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు సాధించిన స్నేహలత



వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు అవార్డు అందుకుంటున్న స్నేహలత

హన్మకొండ: హనుమకొండ వడ్డేపల్లికి చెందిన సైకాలజిస్టు పైండ్ల స్నేహలత వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు సాధించారు. గత నెల 24వ తేదీన హైదరాబాద్‌లో తెలంగాణ సైకాలజిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో 27 మందితో కూడిన బృందం 24 గంటల పాటు నిర్వహించిన వెబినార్‌లో పైండ్ల స్నేహలత 'వ్యక్తిత్వం-వ్యక్తిత్వ వికాసం' అనే అంశంపై ప్రసంగించి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు అవార్డు సాధించారు. దీంతో స్నేహలతను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోత్కూరు రాంచందర్, డాక్టర్ ఎస్.వేణుగోపాలచారి, డాక్టర్ ఉల్లాజీ ఎలియాజర్ అభినందించారు.

కోర్టులో లొంగిపోయిన ఆర్ఐ అన్వేష్

- బెయిల్ తిరస్కరణ.. పరకాల సబ్‌జైలుకు తరలింపు

రామన్నపేట: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో స్మార్ట్‌సిటీ డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్)లు, ప్రైవేట్ కన్సల్టెంట్ల బిల్లుల చెల్లింపు, ఎన్నికల ఖర్చు తదితర పేరుతో బోగస్ పత్రాలు సృష్టించి బిల్లులు కాజేసిన బల్దియా అప్పటి సీసీ, ప్రస్తుత ఆర్ఐ అన్వేష్‌ను మట్టెవాడ పోలీసులు శనివారం పరకాల సబ్‌జైలుకు తరలించారు. అన్వేష్ రెండేళ్ల క్రితం తప్పుడు పత్రాలతో రూ.2.31కోట్ల నిధులకు కాజేయగా, తాజాగా వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. కొన్ని రోజులుగా పరారీలో ఉన్న అన్వేష్ బెయిల్ కోరుతూ కోర్టులో లొంగిపోయాడు. అతనికి బెయిల్ ఇవ్వడాన్ని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ), పోలీసులు వ్యతిరేకించారు. ఇరువురి వాదనలు విన్న జడ్జి.. అన్వేష్‌కు బెయిల్ తిరస్కరిస్తూ రిమాండ్ విధించారు. దీంతో అతన్ని పరకాల జైలుకు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.



కేసు మూలాల్లోకి వెళ్తేనే 'నకిలీ' గుట్టురట్టు

- ఫేక్ ధ్రువపత్రాలతో ఎంబీబీఎస్ సీట్ల కేసు విచారణలో పారదర్శకత అవసరం
- మట్టెవాడ పోలీసులు లోతైన విచారణ చేస్తే మరెన్నో వెలుగులోకి వచ్చే ఛాన్స్
- వీరేనా...ఇంకా ఇతర రాష్ట్రాల్లో ఇలా ఏమైనా జరిగాయా..
- ఏపీ నీట్‌తో దొరికిపోవడంతో ఇప్పటికే రద్దయిన ఏడుగురి ఎంబీబీఎస్ అడ్మిషన్లు

సాక్షి, వరంగల్: కాళోజీ వర్సిటీలో నకిలీ ధ్రువపత్రాలతో ఎంబీబీఎస్ సీట్లు పొందారని వరంగల్‌లోని మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసు విషయంలో సమగ్రమైన దర్యాప్తు చేస్తేనే అసలైన వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది. ఈ కేసులో విద్యార్థుల పాత్ర ఎంత.. దందాకు సూత్రధారిగా చెబుతున్న విజయవాడలోని కన్సల్టెంట్ నిర్వాహకుడు కామిరెడ్డి నాగేశ్వర్ రావు ఏ మేరకు సహకరించారన్న విషయాలు విచారణలో వెల్లడయ్యే అవకాశముంటుంది. మట్టెవాడ పోలీసులు, కాళోజీ వర్సిటీ అధికారులు మాత్రం విద్యార్థులకు తెలియకుండానే జరిగిందని అంటూనే వారి తల్లిదండ్రులను శనివారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. దీంతో అసలు ఈ కేసు విషయంలో పోలీసులు ఏ విధంగా ముందుకెళుతారా అన్నది ప్రశ్నార్థకంగా కనిపిస్తోంది. ఇది విద్యార్థుల భవిష్యత్‌తో ముడిపడి ఉన్న అంశమని చెబుతున్న పోలీసులు.. వారికి తెలియకుండానే ఇది జరిగి ఉంటుందా అన్న దిశగానూ లోతైన విచారణ చేయాల్సి ఉంది. కన్సల్టెంట్ కామిరెడ్డి నాగేశ్వర్ రావు ఇంత ఉన్నత చదువులు చదివిన విద్యార్థుల ప్రమేయం లేకుండానే నకిలీ ధ్రువపత్రాలు సమర్పించారా అంటే అది కూడా అనుమానించే అంశమని పోలీసులు చెబుతున్నారు. ఇప్పటికే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చెప్పిన అంశాలను నోట్ చేసుకున్న పోలీసులు కన్సల్టెంట్ కామిరెడ్డి నాగేశ్వరరావును పట్టుకునేందుకు ఏపీ పోలీసుల సాయం తీసుకుంటున్నట్లు తెలిసింది. అతడిని అదుపులోకి తీసుకుంటేనే ఈ కేసుపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశముంది. వరంగల్ పోలీసు కమిషనర్ ఏవీ రంగనాథ్ కూడా ఈ కేసును సీరియస్‌గా తీసుకోవడంతో విచారణలో వేగిరం పెంచినట్లు తెలిసింది. ఒకవేళ అతను దొరికితే ఈ ఏడుగురు విద్యార్థుల విషయంలోనే ఇది జరిగిందా...లేదా ఇతర రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ సీట్లు పొందిన వారి విషయంలోనూ నకిలీ ధ్రువపత్రాలు ఏమైనా సమర్పించారా...ఎంత పెద్ద మొత్తంలో చేతులు మారాయనే పూర్తి వివరాలు తెలవనున్నాయి.



ఏపీ నీట్‌తో దొరికిపోయారు..

2023–24 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కాళోజీ వర్సిటీనుంచి నోటిఫికేషన్ విడుదలైంది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పోపులు సుబ్రహ్మణ్య సాయి తేజ, వానిపెంట సాయి ప్రతీకారెడ్డి, తమ్మినేని విష్ణు తేజారెడ్డి, తన్నీరు సంజయ్, అరికట్ల హనుమాన్ రెడ్డి, టేకులపల్లి మహేశ్, గేర్లె భార్గవ్ ధర్మతేజ యశ్వంత్ నాయుడు ఎంబీబీఎస్ సీట్లు పొందారు. వీరంతా ఆరు నుంచి తొమ్మిదో తేదీ వరకు తెలంగాణ రాష్ట్రంలో చదివినట్లు ధ్రువపత్రాలు పొందుపరిచారు. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం ఇలా చదివితే లోకల్ అభ్యర్థుల కింద సీట్లు పొందవచ్చు. దీంతో వీరంతా స్థానిక కోటాలో సీట్లు పొందారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ ఏపీలో చదివారు. నీట్ పరీక్ష కూడా ఆంధ్రప్రదేశ్ నుంచి రాయడంతో అనుమానం వచ్చి ధ్రువపత్రాలతో ప్రత్యక్షంగా వర్సిటీకి రావాలని విద్యార్థులను వివరణ కోరారు. వారు పొంతనలేని సమాధానాలు చెప్పారు. విజయవాడలోని ఒక ఏజెన్సీ నడిపే కామిరెడ్డి నాగేశ్వరరావు అనే వ్యక్తి తమకు తెలియకుండా ధ్రువపత్రాలు పొందుపరిచారని అధికారులకు తెలిపారు. దీంతో ఈ ధ్రువపత్రాలు నకిలీవని తేల్చిన వర్సిటీ అధికారులు వీరి ప్రవేశాలను రద్దు చేసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఇందులో భాగంగానే ఆ విద్యార్థుల తల్లిదండ్రులను మట్టెవాడ పోలీసులు శనివారం పిలిచి విచారించినట్లు తెలిసింది. ఈ కేసు పూర్వపరాలపై కాళోజీ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.సంధ్యను సంప్రదిస్తే పోలీసు విచారణలోనే ఎవరిపాత్ర ఏమిటన్నదీ తేలుతుందనే సమాధానమిచ్చారు.

జోష్ ఫుల్.. సౌకర్యాలు నిల్

- దాహంతో అల్లాడిన క్రీడాకారులు
- పట్టించుకోని నిర్వాహకులు
- దాహార్తి తీర్చిన స్థానిక క్రీడాభిమానులు
- ముగిసిన టెమ్రిస్ 2వ జోష్ క్రీడోత్సవాలు

న్యూశాయంపేట: తెలంగాణ మైనారిటీ గురుకుల విద్యాసంస్థల (టెమ్రిస్) ఆధ్వర్యంలో రెండు రోజులు నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి 2వ జోష్ క్రీడోత్సవాలు శనివారం ముగిశాయి. అయితే టెమ్రిస్ అధికారుల నిర్లక్ష్యంతో అథ్లెటిక్స్ క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు గురైనట్లు తెలుస్తోంది. స్టేడియంలో కనీసం తాగడానికి మంచినీళ్లు కూడా ఏర్పాటు చేయలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్వాహకులు పట్టించుకోకపోవడంతో స్థానిక క్రీడాభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ క్రీడాకారులు పోటీల్లో పాల్గొని దాహంతో అల్లాడినట్లు తెలుస్తోంది. కొందరు సొమ్మసిల్లి పడిపోయినట్లు తెలిసింది. ఇది గమనించిన స్థానిక క్రీడాభిమానులు మంచినీరు, పండ్లు ఇచ్చినట్లు సమాచారం. క్రీడోత్సవాల నిర్వాహణ, క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టెమ్రిస్ సెక్రటరీ షఫీయుల్లా పెద్ద మొత్తంలో నిధులు కేటాయించినా కిందిస్థాయి అధికారులు సమన్వయలోపంతో క్రీడాకారులకు కనీసం మంచినీటి సౌకర్యం, తదితర వసతులు కల్పించడంలో విఫలం చెందారని క్రీడాభిమానులు పెదవి విరుస్తున్నారు.

సింథటిక్ ట్రాక్‌పై ఇబ్బందులు..

జేఎన్ఎస్‌లో రన్నింగ్ చేయడానికి క్రీడాకారులు ఇబ్బందులు పడినట్లు తెలుస్తోంది. షూ అందించకపోవడంతో సింథటిక్ ట్రాక్‌పై రన్నింగ్ చేయడానికి క్రీడాకారులు ఇబ్బందులు పడ్డారు. ప్రతిభ, ప్రోత్సాహం పక్కన పెడితే కేవలం పోటీలు నిర్వహిస్తే చాలు అన్నట్లు టెమ్రిస్ అధికారుల వ్యవహార శైలి ఉందని క్రీడాభిమానులు ఆరోపిస్తున్నారు. వివిధ కేటగిరీల్లో పాల్గొనడానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 16 బాలబాలికల మైనారిటీ గురుకులాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. అసౌకర్యాలపై టెమ్రిస్ అధికారులను సంప్రదించగా ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

ముగిసిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ క్రీడలు

వరంగల్ అర్బన్ : వరంగల్ ఇండోర్ స్టేడియంలో అండర్–14,17 విభాగాల్లో నిర్వహిస్తున్న బాలబాలిక రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ క్రీడలు శనివారం సాయంత్రం ముగిశాయి. ఈ వేడుకలకు అసోసియేషన్ ప్రతినిధి జున్ను ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడల్లో గెలుపొందిన బాలబాలికలకు షీల్డ్‌లు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫెన్సింగ్ క్రీడను వరంగల్‌లో నిర్వహించడం ద్వారా ఇక్కడి క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు తోడ్పడుతుందన్నారు. ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి దుబ్బ రాము మాట్లాడుతూ అండర్–14 విభాగంలో బాలబాలికల ఫెన్సింగ్ క్రీడలు పూర్తయినట్లు పేర్కొన్నారు. కాగా, అండర్– 14 విభాగంలో లక్ష్మీనారాయణ రెడ్డి, హరి ప్రకాష్, టి. నితీష్ , వి. వరుణ్ , హిప్పి బాలికల విభాగంలో అదిబా గంగోత్రి, చరిత, అనన్య, అనన్య సింగ్, సాయి శరణ్య, శివాని, హర్షిత, బాలుర విభాగం లోకేష్, బి. ప్రకాష్ గెలుపొందారు.

వరంగల్ 'చాంబర్' వజ్రోత్సవాలు ప్రారంభం



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

- జ్యోతి ప్రజ్వలన చేసిన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్
- కొత్త తరాన్ని వ్యవసాయరంగం వైపు మళ్లించాలి : మంత్రి నిరంజన్‌రెడ్డి



వరంగల్: వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి అధ్యక్షతన రెండు రోజులు నిర్వహిస్తున్న ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు శనివారం రాత్రి ప్రారంభమయ్యాయి. లక్ష్మీపురంలోని చాంబర్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సభలో ఉత్సవాలను రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, గ్రేటర్ మేయర్ గుండు సుధారాణి, స్థానిక ఎమ్మెల్యే నరేందర్.. జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించగా, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ మాట్లాడుతూ జరిగిన చాంబర్ 50 ఏళ్ల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు, జరుగుతున్న 75 ఏళ్ల ప్లాటినం జూబ్లీ ఉత్సవాల్లో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నాన్నారు. వరంగల్ అభివృద్ధిలో చాంబర్ మమేకం కావడంతోనే మెడికల్ కాలేజీ సాకారమైందన్నారు. మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ముఖ్య కేంద్రంగా చాంబర్ పనిచేస్తోందన్నారు. వ్యాపారంతో పాటు సామాజిక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కొత్తతరాన్ని వ్యవసాయరంగం వైపు మళ్లించాలని పిలుపునిచ్చారు. అన్నదాతలు, ప్రజలు, వ్యాపారులతోపాటు వ్యవసాయాన్ని బలోపేతం చేస్తున్న సీఎం కేసీఆర్‌కు ఉండాలన్నారు. చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యాపారులు, ఇండస్ట్రీల యాజమానులు సహకారం వల్లే చాంబర్ నుంచి పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. చాంబర్ ప్రధాన కార్యదర్శి మడూరి వేద ప్రకాశ్.. చాంబర్ కార్యకలాపాలపై నివేదిక సమర్పించారు. ఉత్సవాలను పురస్కరించుకుని సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కాగా, చాంబర్ భవనానికి మాజీ అధ్యక్షుడు కటకం పెంటయ్య తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.3 లక్షల విరాళం ప్రకటించారు. మంత్రి నిరంజన్‌రెడ్డి.. ఏనుమాముల మార్కెట్ సమీపంలో మార్కెట్ స్థలం చాంబర్‌కు కేటాయిస్తున్నట్లు ప్రకటిస్తే తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ.5కోట్లు కేటాయిస్తానని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, రాష్ట్ర చైర్మన్లు బొల్లం సంపత్‌కుమార్, మెట్టు శ్రీనివాస్, మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు, చాంబర్ మాజీ అధ్యక్షులు టి.రమేష్‌బాబు, దిడ్డి కుమారస్వామి, కంభంపాటి కుమారస్వామి, కటకం పెంటయ్య, రైస్ మిల్లర్స్ అధ్యక్షుడు తోట సంపత్, ప్రతినిధులు ఎస్ రెడ్డి లింగారెడ్డి, వీరారావు, రాజు కరాణి, సంపత్, సాగర్ల శ్రీనివాస్, వెల్ది చక్రధర్, స్థానిక కార్పొరేటర్ అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ హత్య

- వివాహేతర సంబంధమే కారణమనే అనుమానం?
- పోలీసుల అదుపులో నిందితుడు?



రాజు (ఫైల్)

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం మడిపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు తుమ్మల రాజు(30) హత్యకు గురయ్యాడు. కాళ్లు, చేతులను తాడుతో కట్టి హత్య చేసినట్లు తెలిసింది. ఆ తర్వాత మృతదేహాన్ని ఎస్సారెస్పీలో పడేసినట్లు సమాచారం.. మృతదేహం కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.మడిపల్లికి చెందిన తుమ్మల రాజు బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నాడు.అయితే అన్నాసాగరానికి చెందిన తన బాల్యస్నేహితురాలితో రాజుకు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇది వివాహేతర సంబంధానికి దారితీసినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఈవిషయమై పలుమార్లు రాజును హెచ్చరించినా మార్పు రాలేదని స్థానికులు చర్చించుకుంటున్నారు.

పట్టుబడ్డడా? ఫోన్ చేసి రప్పించారా?

ఇదిలా ఉండగా, శనివారం ఉదయం నుంచి రాజు, పక్క గ్రామానికి చెందిన తన పార్టీ నాయకుడితో కలిసి అతిగా మద్య సేవించినట్లు స్థానికులు చెబుతున్నారు. తొలుత ఎల్కతుర్తిలోని ఓ వైన్‌షాపులో, ఆ తర్వాత జయగిరిలో.. అనంతరం అన్నాసాగరంలోని శ్మశాన వాటిక వద్ద మద్యం తాగినట్లు తెలిసింది. అయితే మద్యం సేవించాక.. ఆ యువతి ఇంటికి వెళ్లి పట్టుబడ్డడా? ఫోన్ చేసి రాజును రప్పించి హత్య చేశారా అనే అంశం ప్రశ్నార్థకంగా మారింది. దుండగులు రాజును ఇంటి వద్దే కట్టేసి ఆటోలో తీసుకెళ్లి హత్యచేసి, ఆ తర్వాత మృతదేహాన్ని ఎస్సారెస్పీలో పడేసినట్లు తెలిసింది.

పోలీసుల అదుపులో నిందితుడు?

కాగా, హత్య అనంతరం నిందితుడు పోలీసులకు లొంగిపోయినట్లు తెలిసింది. రాజును చంపి కాల్వలో పడేసినట్లు నిందితుడు పోలీసులకు వెల్లడించినట్లు సమాచారం. ఘటనా స్థలిని కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజ్ సందర్శించారు. రాజు పట్టుబడ్డడా? ఫోన్‌చేసి రప్పించి హత్యచేశారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

సైంటిఫిక్ రీసెర్చ్‌లో ఇండియా లీడర్

కాజీపేట అర్బన్ : జీ–20 సదస్సులో భారతదేశం సైంటిఫిక్ రీసెర్చ్ లీడర్‌గా నిలిచిందని భారత ప్రభుత్వ డీఎస్టీ(డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ) హెడ్ ఎస్.కే.వర్ష్నే తెలిపారు. నిట్ వరంగల్‌లోని అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో ×ది ఆసియా–ఓషియానియా సోనోమికల్ సొసైటీ× ఆధ్వర్యంలో నిట్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేటి సమాజంలో మానవాళి మనుగడకు ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి సోనో కెమిస్ట్రీ, సోనో టెక్నాలజీ ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ, చైనా, ఆస్ట్రేలియా, కొరియా, జపాన్, బ్రెజిల్, బ్రూనే దేశాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ముక్తార్ పాషా.. కార్మిక మార్గదర్శి

- ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు సాదినేని వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఖిలా వరంగల్ : కార్మిక ఉద్యమ నిర్మాణంలో జాతీయ జాతీయ స్థాయికి ఎదిగి అసువులు బాసిన ముక్తార్ పాషా కార్మిక వర్గానికి మార్గదర్శి అని ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు సాదినేని వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం వరంగల్ ఫోర్ట్ రోడ్డు అన్నపూర్ణ ఫంక్షన్ హాల్‌లో ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి ముక్తార్ పాషా వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఎనిమిది గంటల పని దినాలు రద్దు చేసి 12 గంటలు అమలు చేస్తోందని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌కు అప్పగిస్తోందని విమర్శించారు. ప్రైవేటీకరణ పెరిగి కార్మికుల హక్కులన్నీ హరించబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హక్కులను రక్షించుకోవడానికి విశాల కార్మిక ఉద్యమాన్ని నిర్మించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు ఎం. శ్రీనివాస్, సీతారామయ్య, ఎండీ రాసుద్దీన్, గంగుల దయాకర్, బండి కోటేశ్వరరావు, బొడ్డుకుమారస్వామి, నలిగంటి విజయపాల్, రాచర్ల బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి..

- పది మంది అరెస్ట్
- రూ.1,21,250నగదు స్వాధీనం
- రెండు కార్లు, మూడు బైక్‌లు సీజ్



పేకాటరాయుళ్ల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

హసన్‌పర్తి: కేయూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ పేకాట శిబిరంపై శనివారం రాత్రి పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా పదిమంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.1,21,250 నగదు స్వాధీనం చేసుకున్నారు. రెండు కార్లు, మూడు బైక్‌లు, పది సెల్‌ఫోన్‌లు సీజ్ చేశారు. సీఐ అబ్బయ్య కథనం ప్రకారం పీఎస్ పరిధి గోపాల్‌పూర్ కల్లు మండువ సమీపంలోని ఓ ప్రాంతంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న గోపాల్‌పురానికి చెందిన కె.మహేందర్, హుజూరాబాద్ మండలం పెద్దపాపయ్యపల్లికి చెందిన బోడ ప్రశాంత్, గోపాలపురం కృష్ణాకాలనీ చెందిన కె.లవన్‌కుమార్, ములుగు మండలం రాంనగర్‌కు చెందిన గాడే రమేష్, భీమదేవరపల్లి మండలం మాణిక్యపురానికి చెందిన గోపి, హసన్‌పర్తి మండలం పెంబర్తికి చెందిన పల్లె విద్యాసాగర్‌రెడ్డి, హనుమకొండ భవానీ నగర్‌కు చెందిన గొట్టిముక్కల రవీందర్, హనుమకొండ నక్కలగుట్టకు చెందిన రాయిని సుధాకర్, హసన్‌పర్తి మండలం నాగారంలోని సప్తగిరి రైస్ మిల్లు నిర్వాహకుడు పోలసాని వెంకటేశ్వర్లు, గోపాలపురానికి చెందిన దూలం తరుణ్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ అబ్బయ్య తెలిపారు.

పీహెచ్‌డీ అడ్మిషన్ల అవకతవకలపై స్పందించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థి జేఏసీ నాయకులు, విద్యార్థులు

కేయూ క్యాంపస్: కేయూ పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అవకతవకలపై ప్రభుత్వం స్పందించి ప్రతిభ గల విద్యార్థులకు న్యాయం చేయాలని, లేని పక్షంలో అక్టోబర్ 2 గాంధీ జయంతి సందర్భంగా తాము ఆత్మార్పణ చేసుకుంటామని కేయూ జేఏసీ నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు శనివారం కేయూ దూరవిద్య కేంద్రం నుంచి పోలీస్ కమిషనరేట్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ రోడ్డుపై బైఠాయించి కొంత సేపు ఆందోళన చేశారు. ప్రతిభ గల విద్యార్థులకు అన్యాయం చేసి ఉద్యోగాలు చేస్తున్న వారికి పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించారని మండిపడ్డారు. కేయూ వీసీ, రిజిస్ట్రార్‌ల అవకతవకల చిట్టాను వరంగల్ పోలీసు కమిషనర్‌కు ఇప్పటికే అందజేశామన్నారు. వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీహెచ్‌డీ అడ్మిషన్ల వ్యవహారంపై తాము 25 రోజుల నుంచి దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని దుయ్యబట్టారు. ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తున్న పల్లా రాజేశ్వర్ రెడ్డి ముఖ్యమో.. యూనివర్సిటీ విద్యార్థుల భవిష్యత్ ముఖ్యమో ప్రభుత్వం తేల్చుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేయూ విద్యార్థి జాక్ చైర్మన్ తిరుపతి యాదవ్, జాక్ నేతలు అంబాల కిరణ్, మేడ రంజిత్ కుమార్, రాజునాయక్, నిమ్మల రాజేష్, మాచర్ల రాంబాబు, ఎండీ పాషా, అంకిల్ల శంకర్ , మట్టెడ కుమార్ , అరెగంటి నాగరాజు, కేతపాక ప్రసాద్, ప్రశాంత్, కాయిత నాగరాజు, రమేష్, హర్షవర్ధన్, మనోహర్ , విజయ్ పాల్గొన్నారు. కాగా, సీపీ రంగనాథ్.. విద్యార్థి నాయకులను తన కార్యాలయానికి పిలిపించుకుని మాట్లాడారని సమాచారం. విద్యార్థులు ఇచ్చిన వివరాలను తాను కేయూ వీసీ రమేష్‌కు పంపానన్నారు. దీనిపై వీసీ నాలుగురోజుల్లో సమాధానం ఇస్తారని రంగనాథ్ విద్యార్థులతో అన్నట్లు సమాచారం.